మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

సోమవారం MONDAY 15-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 347 Issue: 347

15 జూన్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:47 తిథి అమావాస్య ఉ. 8:24 వరకు తరువాత పాడ్యమి తె. 4:300 వరకు సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మృగశిర రా. 7:08 వరకు తరువాత ఆరుద్ర యోగం శూల ఉ. 8:53 వరకు కరణం నాగవ ఉ. 8:24 వరకు స్తుఘ్నమ సా. 6:27 వరకు వర్జ్యం రా. 2:30 నుండి తె. 3:54 వరకు దుర్ముహూర్తం మ. 12:42 నుండి మ. 1:34 వరకు మ. 3:18 నుండి సా. 4:11 వరకు రాహుకాలం ఉ. 7:23 నుండి ఉ. 9:01 వరకు యమగండం ఉ. 10:38 నుండి మ. 12:16 వరకు గుళికాకాలం మ. 1:54 నుండి మ. 3:32 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు ఉ. 11:27 నుండి మ. 12:51 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:42 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## పాక్ విలవిల

### తిప్పేసిన దీప్తి, చరణి

దాయాదిపై భారత్ ఘన విజయం



## పసిడి గురి అదిరింది!

ధీరజ్, కుంకుమ్ పసిడి కైవసం

షాక్ తిన్న కొరియా ఆర్చర్లు



## 53 ఏళ్ల తర్వాత..!

ఎన్‌బీఏ ట్రోఫీని ముద్దాడిన న్యూయార్క్ నిక్స్

బాస్కెట్‌బాల్ చరిత్రలో సరికొత్త రికార్డు

..పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..

# మీరు పోరాడండి.. మీ వెన్నంటి మేముంటాం!



స్వచ్ఛమైన గాలి, నీరు ఆవశ్యకం

కాంక్రీట్ జంగిల్స్ పనికి రావు

సీజేపీది స్వచ్ఛమైన ఉద్యమం

సామాజిక ఉద్యమకారుడు

సోనమ్ వాంగ్ చుక్

హైదరాబాదీలపై ప్రశంసలు

దేశంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సీజేపీ నిరసనలో ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన యూత్‌ను ఉద్దేశించి ఆయన ఎమోషనల్ స్పీచ్ ఇచ్చారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతదేనని.. తన లాంటి వారు ఎప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ.. వెన్నంటి ఉంటారని పిలుపునిచ్చారు.

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): ఈ క్రమంలోనే దేశంలో విద్యా వ్యవస్థతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ముఖ్యం అని సోనమ్ వాంగ్‌చుక్ తేల్చి చెప్పారు. రానున్న తరాలకు చదువు ఎంత అవసరమో.. వారు పీల్చుకోవడానికి స్వచ్ఛమైన గాలి.. తాగేందుకు స్వచ్ఛమైన నీరు కూడా అంతే ముఖ్యమని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో హైదరాబాద్ ప్రజల పోరాటం దేశానికే ఆదర్శమని కొని యాడారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు పరిరక్షణ కోసం చేసిన ప్రచార కార్యక్రమాలు.. భూమి, నదులను కాపాడుకునేందుకు వారు తెగించిన తీరుపై ఆయన అభినందనలు తెలిపా రు. అడవులను నరికేసి కాంక్రీట్ తరువాయి 2 వ పేజీలో...



# ఏసీ రూముల్లో కూర్చుంటే కుదరదు!

## వర్షం వస్తే రోడ్డుపైకి వచ్చి పనిచేయాల్సిందే

### అవసరమైతే నేనూ రోడ్డెక్కుతా.. అధికారులపై సీఎం రేవంత్ సీరియస్

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించిన సీఎం.. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలపై జూన్ 1నే నిర్వహించిన రివ్యూలో అన్ని ముందస్తు సూచనలు ఇచ్చినప్పటికీ, జూన్ 9న వర్షం వచ్చినప్పుడు అధికారులు సరిగా పనిచేయలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షం కురిసిన సమయంలో అత్యంత కీలకమైన ప్రాంతాలలో మున్సిపల్, పోలీస్ అధికారుల మధ్య కనీస సమన్వయం లేకపోవడాన్ని ముఖ్యమంత్రి తప్పుబట్టారు.

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): ఇకపై వర్షం పడినప్పుడు నీరు నిలిచే ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాలు విపరీతంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడే ప్రాంతాల డేటా ఆధారంగా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఆదేశించారు. మానవ తప్పిదాల వల్ల గానీ, అధికారుల నిర్లక్ష్యం వల్ల గానీ ప్రజలకు సమస్యలు వస్తే అస్సలు సహించేది లేదని స్పష్టం చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో ఊరికే ఏసీ గదుల్లో కూర్చుంటే కుదరదని, ఫీల్డ్‌లో ఉండని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. "వర్షం పడేటప్పుడు ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ రోడ్లపైనే ఉండి పరిస్థితిని చక్కదిద్దాలి. అవసరమైతే ముఖ్యమంత్రినైన నేను కూడా స్వయంగా రోడ్డు మీదికి వస్తాను" అని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. అలాగే వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. నగరంలో వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన సీఎం.. ట్రాఫిక్ నియంత్రణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఇందులో భాగంగానే ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను తరువాయి 2 వ పేజీలో...



బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,908 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |



# టీఎంసీ సతమమతం!

## నేషనలిస్ట్ సిటిజన్ పార్టీలోకి టీఎంసీ రెబల్స్

### విలీనానికి 20 మంది ఎంపీలు నిర్ణయం

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి వరస ఎదురుదెబ్బలు తాకుతున్నాయి. ఆ పార్టీకి లోక్‌సభలో 28 మంది ఎంపీలు ఉంటే, 20 మందికి పైగా ఎంపీలు తిరుగుబాటు చేశారు. వీరంతా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. మరోవైపు, మమత ఇండియా కూటమిలో ఉన్నప్పుడు, ఎంపీలు మాత్రం ఎన్డీయే కూటమిలో భాగస్వామ్యం కాబోతున్నారు.

కోల్‌కతా: ఇదిలా ఉంటే, రెబల్ వర్గంగా ఉన్న 20 మంది ఎంపీలు, తమ వర్గాన్ని 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (NCPI) అనే ప్రాంతీయ పార్టీలో విలీనం చేసి, ఆ తర్వాత ఎన్డీయేకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకోవడం సంచలనంగా మారింది. ఈ చర్యతో టీఎంసీలో సంక్షోభం మరింత ముదిరింది. టీఎంసీలోనే ప్రత్యేక వర్గంగా ఉండటం వల్ల న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయనే రెబల్ తరువాయి 2 వ పేజీలో...



# పడవ బోల్తా.. నలుగురు మృతి


## ఏపీలోని పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం

పల్నాడు, జూన్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురు మృతిచెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు సమీపంలో కృష్ణా నదిలో పడవ బోల్తా పడింది. 10 మంది బంధువులు కలిసి నదిలో విహారయాత్రకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో పడవ బోల్తా పడటంతో అందులో వారంతా నీటిలో పడిపోయారు. దీంతో అక్కడి స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆరుగురినికాపాడారు. అయితే నలుగురు మాత్రం నదిలో గల్లంతయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గల్లంతైన నలుగురి మృతదేహాలను గుర్తించారు. మృతులను తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జాంబియాలో ని ఒక ఫుట్‌బాల్ ఆటగాడికి "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్"గా ట్రోఫీకి బదులుగా ఐదు గుడ్ల ట్రేలు అందజేశారు. ఒక గోల్ చేసినందుకు రెండు ట్రేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు మూడు ట్రేలు కలిపి మొ-త్తంగా ఐదు ట్రేలు అందజేశారు. స్థానిక ఫుట్‌బాల్ సంస్కృతిలో ప్రతీకాత్మక బహుమతుల కంటే ఉపయోగకరమైన వస్తువులను ఇవ్వడం కోసమే ఇలా చేశారట.



# భద్ర్రాద్రి జిల్లాలో భూకంపం

### భయాందోళన చెందిన ప్రజలు

### రిక్టర్ స్కేలుపై 3.8గా నమోదు

కొత్తగూడెం, జూన్ 14 (ఈవార్తలు): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భూకంపం సంభవించింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం తెల్లవారుజాము 2.26 గంటలకు స్వల్ప భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 3.8గా నమోదైంది. అయితే పలుచోట్ల భూప్రకంపనలు చోటుచేసుకోవడంతో జనాలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భూకంప కేంద్రం 10 కి.మీ లోతులో ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ పేర్కొంది.




# నీట్ అడ్మిట్ కార్డులు విడుదల

న్యూఢిల్లీ: ఈ నెల 21న జరగనున్న నీట్ (యూజీ) పరీక్షకు హాజరవుతున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తాజాగా అధికారికంగా రిలీజ్ చేసింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎన్‌టీఏ అఫీషియల్ వెబ్‌సైట్‌ను సందర్శించి తమ హాల్ టికెట్లను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ఎన్‌టీఏ పరీక్ష సమయం, విద్యార్థులకు అనుకూలంగా కొన్ని కీలక మార్పులు చేయడంతో ఈసారి నీట్ ఎగ్జామ్ మరింత ప్రత్యేకంగా మారింది. ఈ సారి నీట్ రాస్తున్న విద్యార్థులకు ఎన్‌టీఏ ఒక బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ఎగ్జామ్ టైంను పెంచుతూ ఎన్టీఏతరువాయి 2 వ పేజీలో...



# పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

### మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం

షోలాపూర్, జూన్ 14 (ఈవార్తలు): మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే తరువాయి 2 వ పేజీలో...



# వెన్నుపోటు పొడిచింది ముఖ్యమంత్రి రేవంతే

### మీనాక్షి నటరాజన్‌పై కుట్రలు చేశాడు

### రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో కుమ్మక్కు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు.

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

15.6.2026

మేషం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపార వ్యవహారాల్లో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. గృహమున శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి.

వృషభం: ఆర్థిక లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. జీవిత భాగస్వామితో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.

మిధునం: కొన్ని వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. వ్యాపారస్థులకు అవసరానికి ధన సహాయం అందుతుంది. నూతన వాహనయోగం ఉన్నది. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక పురోగతి సాధిస్తారు.

కర్కాటకం: ఉద్యోగాలలో అధికారులతో చర్చల్లో పురోగతి కలుగుతుంది. మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. బంధు మిత్రుల నుండి కొత్త విషయాలు తెలుసుకుంటారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో కష్టానికి తగిన ఫలితం పొందుతారు.

సింహం: ఇంటాబయట కొద్దిపాటి సమస్యలు తప్పవు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహారించాలి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి.

కన్య: ఇతరులకు ధన పరంగా మాట ఇవ్వడం మంచిది కాదు. ఉద్యోగాల్లో కష్టానికి తగిన గుర్తింపు లభించదు. ఆస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. చేపట్టిన వ్యవహారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు.

తుల: పాత ఋణాలు తీర్చగలుగుతారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. సన్నిహితులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఆశాజనకంగా సాగుతాయి.

వృశ్చికం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. చాలాకాలంగా పూర్తికాని పనులు సకాలంలో పూర్తి అవుతాయి. పాత బాకీలు వసూలవుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఆశించిన లాభాలు పొందుతారు. కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి.

ధనస్సు: బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితులతో ఆలయాలు దర్శించుకుంటారు. వృత్తి, వ్యాపారాలు కొంత మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించవు.

మకరం: అవసరానికి ఇతరుల సహాయ సహకారాలు అందక ఇబ్బందిపడతారు. బంధుమిత్రుల నుంచి ఊహించని మాటలు వినవలసి వస్తుంది. చేపట్టిన పనులు మధ్యలో వాయిదా వేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో చికాకులు పెరుగుతాయి.

కుంభం: చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి. బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపార, ఉద్యోగాలు అనుకూలంగా సాగుతాయి.

మీనం: ఉద్యోగమున పని ఒత్తిడి పెరిగి సమయానికి నిద్రహారాలు ఉండవు. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. అనుకున్న పనులు సకాలంలో పూర్తికావు. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి.




# ఏసీ రూముల్లో కూర్చుంటే కుదరదు!


మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. వర్షాకాలం ముగిసేవరకు అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉంటూ, పరస్పర సమన్వయంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు తెలంగాణలో రాగల మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు జిల్లాలకు అలర్ట్‌లు జారీ చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని, రాబోయే నాలుగైదు రోజుల్లో ఇవి రాష్ట్రమంతటా విస్తరిస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# ..మీ వెన్నంటి మేముంటాం!

మొదటి పేజీ తరువాయి

బిల్డింగ్‌లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తే ప్రజలు సంతోషిస్తారనే తప్పుడు నమ్మకంలో పాలకులు ఉన్నారని.. ఆయన విమర్శించారు. ఈ కాంక్రీట్ జంగిల్స్ పిల్లల భవిష్యత్తును కాపాడలేవని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అడవులు, నదులను రక్షించేందుకు ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి.. గొంతు విప్పాలని అప్పుడే విజయం సాధ్యం అవుతుందని తెలిపారు. దీర్ఘకాలంలో విద్యను, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే.. ముందుగా ఒక క్రియాశీలక, నిజాయితీగా పనిచేసే ప్రజాస్వామ్యం కావాలని సోనమ్ వాంగ్‌చుక్ ఆకాంక్షించారు. తమకు విద్యా శాఖ మంత్రి అవ్వాలని.. కొత్త రాజకీయ పార్టీ పెట్టాలని.. ఎలాంటి సొంత ప్రయోజనాలు, ఆశలు లేవని సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. కాక్రోజ్ జనతా పార్టీ అంటే.. అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడే రాజకీయ వేదిక కాదని.. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ఒక పవిత్రమైన ప్రయత్నమని తెలిపారు. యూత్‌ను చైతన్యపరిచే లక్ష్యంగా సాగుతున్న ఒక స్వచ్ఛమైన ఉద్యమం అని ఆయన అభివర్ణించారు. దేశంలో నిత్యం వేధిస్తున్న ఈ పేపర్ లీకులు, పరీక్షల రద్దు వంటి తీవ్రమైన సమస్యలకు ఇకనైనా ముగింపు పలకాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవస్థలో తప్పు జరిగినపుడు మంత్రి అయినా.. చివరికి ప్రధాని అయినా సరే ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని తేల్చి చెప్పారు. చదువును కేవలం పరీక్షలకు మాత్రమే పరిమితం చేయకుండా.. విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది రానున్న తరాల ఫ్యూచర్ కోసం బలమైన పునాది వేయాలని సోనం వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు.





# టీఎంసీ సతమమతం!

మొదటి పేజీ తరువాయి

వర్గం విలీనం ఆలోచనతో ప్లాన్ చేసింది. "మేము 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ'లో చేరాము. ఇది గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీ. మేము అందులో విలీనమయ్యాము. అసలైన టీఎంసీ ఏది అనేది కోర్టు నిర్ణయిస్తుంది," అని టీఎంసీ రెబల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ అన్నారు. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశం తర్వాత ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాలో రెబల్ వర్గం సమావేశమైన కొన్ని గంటల తర్వాత ఈ రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు, మమతా మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఓం బిర్లాకు లేఖ రాస్తూ.. టీఎంసీని ఒకే రాజకీయ పార్టీగా పరిగణించాలని, పార్టీకి చెందిన ఏ ఇతర వర్గానికి లేదా సమూహానికి ఎలాంటి గుర్తింపు, సదుపాయాలు కల్పించొద్దని కోరారు.



# పడవ బోల్తా.. నలుగురు మృతి

మొదటి పేజీ తరువాయి

గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా గుర్తించారు. వీరంతా కోనూరులో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే వారు సరదాగా నదిలో విహారయాత్రకు వెళ్లినట్టుగా తెలుస్తోంది. ఇదిలాఉంటే, కృష్ణా నదిలో పడవ ప్రమాదం బాధాకరమని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని కోనూరు వద్ద కృష్ణా నదిలో జరిగిన పడవ ప్రమాదం విషాదకరమని వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ కుటుంబ వేడుకకు హాజరైన బంధువులు పడవలో ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించి అన్ని విధాలుగా అండగా నిలవాలని వైఎస్ జగన్ కోరారు.

రూ.5 లక్షల పరిహారం

ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పుల పరిహారం ప్రకటించారు. ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ఆయన, ప్రమాద విషయం తెలిసిన వెంటనే అక్కడి నుంచే పల్నాడు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా అత్యవసర సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పడవ నదిలోని ఇసుక దిబ్బను గుద్దుకోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని, ఇందులో నలుగురు మృతి చెందగా మిగిలిన ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన గంధం శైను, గంధం సంధ్య, బత్తుల కార్తీక్, కాంతం చైతన్యల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని మృతుల కుటుంబాలకు తక్షణమే అందజేయాలని పల్నాడు కలెక్టర్‌ను ఆదేశించారు. నది నుంచి వెలికితీసిన మృతదేహాలను ఏరియా ఆసుపత్రికి తరలించామని, పోస్టుమార్టం ప్రక్రియ ముగిసిన అనంతరం బంధువులకు అప్పగిస్తామని అధికారులు వెల్లడించారు.



# పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.



# వెన్నుపోటు పొడిచింది ముఖ్యమంత్రి రేవంతే

మొదటి పేజీ తరువాయి

ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# నీట్ అడ్మిట్ కార్డులు విడుదల

మొదటి పేజీ తరువాయి

కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్ష మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు (మొత్తం 3 గంటల 15 నిమిషాలు లేదా 195 నిమిషాలు) పాటు జరగనుంది. పెంచారంటే ఎగ్జామ్ సెంటర్‌లో అటెండెన్స్ షీట్లపై సంతకాలు, బయోమెట్రిక్ లేదా ఇతర వెరిఫికేషన్ ప్రక్రియల సమయంలో విద్యార్థులు కోల్పోయే సమయాన్ని భర్తీ చేయడానికి పరీక్ష సమయాన్ని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఉండే క్లిష్టమైన ప్రాబ్లమ్స్, లెక్కలను సాల్వ్ చేయడానికి (రఫ్ వర్క్ కోసం) ఈసారి ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో అదనంగా ఎక్కువ స్థలాన్ని కేటాయించారు.

# 17న నల్లగొండకు రేవంత్



**సభ ఏర్పాట్లు పరిశీలించిన కోమటిరెడ్డి**

నల్లగొండ, జూన్ 14 (ఈవార్తలు): నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ స్థలాన్ని ,హ్యాం రోడ్ల పైలాన్, హెలిప్యాడ్ స్థలాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ.. 17వ తేదీ మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లా, కనగల్ మండలం రానున్నారని, రాష్ట్ర చరిత్రలోనే కనీవినీ ఎరగని రీతిలో ఒకే రోజున ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చే మొదటి ప్యాకేజీ కనగల్ మండలం, ధర్వేశిపురం నుంచి డిండి వరకు నిర్మించే రహదారితో రాష్ట్రంలోని అన్ని హ్యాం రోడ్లకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆర్ అండ్ బి రహదారులతో పాటు, మరో 7వేల కోట్ల రూపాయలతో గ్రామాల నుండి మండలాలకు, మండలాల నుంచి జిల్లా కేంద్రం వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు నిర్మించనున్నామని తెలిపారు. వీటికి వచ్చేవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రెండు సంవత్సరాలలో హ్యాం రోడ్లన్నింటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోడ్లు ఉంటేనే పరిశ్రమలు, సంక్షేమ ఉంటాయని, అందువల్ల గడచిన సంవత్సరం కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు చేసి రిజర్వాంట్ ద్వారా అప్పుగా నిధులు తీసుకుని రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్బీసీ సొరంగం కూడా హ్యాం రోడ్లు పూర్తయ్యే లోగా అంటే 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. దీని ద్వారా జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. ఇది తన కలల ప్రాజెక్టు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. వీటితోపాటు, ఏఆర్పి కాలువల లైనింగ్ కు 450 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, ఈ శంకుస్థాపన కార్యక్రమం కూడా అదే రోజు ఉంటుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మించే హ్యాం రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు ,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో తాగునీటిపై ప్రత్యేక నిధులు మంజూరు చేయించడం జరిగిందని, ఈ పనులకు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి కనగల్ లోనే శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## హైదరాబాద్ జంట జలాశయాలకు వరద

**భారీ వర్షాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు ఇన్‌ఫ్లో**

**800 క్యూసెక్కుల నీరు జలాశయాల్లోకి వస్తున్నట్టు వెల్లడి**

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షాలకు హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చే జంట జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు మూసీ నది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను, ఇన్‌ఫ్లోను నిశితంగా గమనిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి అందిన సమాచారం ప్రకారం.. జలాశయాల్లోకి సుమారు 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1,784.30 అడుగుల వద్ద నీరు ఉంది. అదేవిధంగా, హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1,760.60 అడుగుల వద్ద కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి.. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీస్, హైడ్రా విభాగాలను అప్రమత్తం చేశారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ రుతుపవనాల సీజన్‌లో జలాశయాలకు ఇదే మొదటి చెప్పుకోదగ్గ వరద ప్రవాహం. ప్రస్తుతానికి గేట్లు తెరిచేంత ప్రమాదం లేదని, ఒకవేళ పరిస్థితిని బట్టి గేట్లు ఎత్తివేయాల్సి వస్తే ఆ సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి కోసం రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్

**పెంపుడు కుక్క మృతితో కొనసాగుతున్న మిస్టరీ**

కాకినాడ, జూన్ 14 (ఈవార్తలు): కాకినాడ జిల్లాలో అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు మరింత ముమ్మరమయ్యాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలు కూడా రంగంలోకి దిగాయి. ఇప్పటికే ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, అటవీ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలకు చెందిన 400 మంది సిబ్బంది గాలింపులో పాల్గొంటున్నారు. తుని మండలం సిహెచ్ అగ్రహారంలోని పామాయిల్ తోటలో జూన్ 6న చిన్నారి జ్ఞానేశ్వరి తప్పిపోయింది. తోటలో పనిచేసే తల్లిదండ్రులు గణేశ్, భవానీ మధ్య సమన్వయ లోపం కారణంగా పాప అదృశ్యమైంది. ఆ రోజు సాయంత్రం ఒక గ్రామస్థుడు పాపను, దాని పెంపుడు కుక్కను కొండ సమీపంలో చూశాడు. పాపను తీసుకురావడానికి ప్రయత్నించగా, కుక్క అడ్డుకుంది. ఈ కేసులో కీలకమైన పెంపుడు కుక్క శనివారం మృతి చెందడంతో మిస్టరీ మరింత జఠిలంగా మారింది. జూన్ 9న ఒంటరిగా ఇంటికి తిరిగి వచ్చిన ఈ కుక్కకు, పోలీసులు జూన్ 12న జీపీఎస్ ట్రాకర్ అమర్చి పాప ఆచూకీ కనుగొనే ప్రయత్నం చేశారు. అయితే, ఆ కుక్క అనూహ్యంగా ప్రవర్తిస్తూ, ఆహారం తీసుకోకుండా దాదాపు 80 గంటల పాటు, 8 కిలోమీటర్లు తిరిగి ఇంటికి వచ్చాక మరణించింది. కుక్క మృతికి కారణం తెలుసుకునేందుకు అధికారులు పోస్టుమార్టంకు పంపించారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. చిన్నారి ఆచూకీ తెలిపిన వారికి జిల్లా యంత్రాంగం లక్ష రూపాయల రివార్డు ప్రకటించింది. అత్యాధునిక డ్రోన్లు, 38 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషిస్తూ గాలింపు కొనసాగిస్తున్నామని కాకినాడ ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు.

## నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులు స్కూల్ బాట పట్టనున్నారు. సోమవారం నుంచి స్కూళ్లు ప్రారంభమవుతుండడంతో స్కూలు యాజమాన్యాలు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, సోమవారం అమావాస్య కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్‌కు పంపేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం, లేదా బుధవారం నుంచి పాఠశాలలకు పంపాలని యోచిస్తున్నారు. పలు పాఠశాలలు కూడా అమావాస్య రోజు కాకుండా, బుధవారం పాఠశాలలు ప్రారంభించనున్నట్లు సందేశాలు పంపిస్తున్నట్లు తెలిసింది.

**అన్ని రూట్లలో తగినన్ని బస్సులు**

విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్‌ల అధికారులను ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం, సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండీ నాగిరెడ్డి ఆదేశించారు.

# సర్.. దొంగ



**ప్రతిపక్షాల ఓట్లు కొల్లగొట్టే కుట్ర**

**మాజీమంత్రి హరీశ్ ఆరోపణలు**

హనుమకొండ, జూన్ 14 (ఈవార్తలు): కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 'సర్' పేరుతో ప్రతిపక్షాల ఓట్లు తీసేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్'పై మనం అప్రమత్తంగా ఉంటే ఏం కాదని చెప్పుకొచ్చారు. ఆదివారం హనుమకొండలో హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. 'సర్'పై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 'సర్' పై చాలా జాగ్రత్తగా ఉంటేనే గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పోవాలే.. కేసీఆర్ అధికారంలోకి రావాలని జనం అంటున్నారని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కల్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని ప్రస్తావించారు. కల్యాణలక్ష్మితో బాల్య వివాహాలు ఆగిపోయాయని తెలిపారు. కేసీఆర్ సంక్షేమ పథకాల వెనక ఒక విజన్ ఉందని ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నరేళ్లుగా కొట్లాడుతున్నామని తెలిపారు. కార్యకర్తల అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తల పిల్లల కోసం పుస్తకాలను పార్టీ నేతలు పంపిణీ చేయడం సంతోషకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'హిట్లర్ చేసిన దురాగతాలకు జర్మనీ ప్రజలు ఇప్పటికీ క్షమాపణ చెబుతారు. కాంగ్రెస్ వాళ్లుకూడా రేవంత్ తప్పిదాలకు క్షమాపణ చెప్పాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లో ఒక నియంత ఉంటే ఇక్కడొక నియంత ఉన్నారు. తెలంగాణలో కోట్ల రూపాయల బొగ్గు స్కాం జరిగింది. నన్ను భూపాలపల్లి బొగ్గుబావుల్లోకి వెళ్లనివ్వలేదు. బొగ్గు స్టాక్ ఉందా అంటే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నోరు విప్పడంలేదు. అక్రమాలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు. నాపై పది కేసులు పెట్టారు. కేసులు పెడితే భయపడబోం. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తే... విచారణ జరపకుండా... దొంగకు తాళంచెవి ఇచ్చినట్లుగా రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వడ్ల కొనుగోళ్లు జరగక ముందే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి యాడ్స్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి ఉంటే యాభైఏళ్ల దాకా కాంగ్రెస్ మొలకెత్తదు. పోలీసులు అక్రమ కేసులు పెడితే ఊరుకోం. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. బీఆర్ఎస్‌కు 88స్థానాలు వస్తాయని సర్వేలు చెబుతున్నాయి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ఎల్ నినో.. అన్నమూ పిరం!

**ఆహార ధరలు పెరిగే చాన్స్**

**ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రపంచ దేశాలు**

న్యూఢిల్లీ, జూన్ 14: జూన్-ఆగస్టు మధ్య కాలంలో ఎల్ నినో ఏర్పడే అవకాశం సుమారు 80 శాతం ఉందని తాజా బ్యాంక్ ఆఫ్ బరోడా రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితి నవంబర్ వరకు కొనసాగే అవకాశం 90 శాతానికి పైగా ఉండవచ్చని నివేదిక హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో ఆహార ద్రవ్యోల్బణం పెరగవచ్చని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం దేశంలో జలాశయాల నీటి నిల్వలు సాధారణ స్థాయికి మించి ఉండడం, కూరగాయల సరఫరా కూడా సంతృప్తికరంగా ఉండటం కొంత ఊరట కలిగిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా రీసెర్చ్ నివేదిక ప్రకారం, ఇంధన ధరల పెరుగుదల, వాతావరణ అనిశ్చితులు కలిపి 2026--27 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధర సూచీ ద్రవ్యోల్బణం 5.2% నుంచి 5.5% మధ్య ఉండే అవకాశం ఉంది. మే 2026లో సీపీఐ ద్రవ్యోల్బణం 3.9%గా నమోదైంది. ఏప్రిల్‌లో ఇది 3.5% ఉండగా, పెరుగుదల ప్రధానంగా ఆహార, ఇంధన ధరల వల్లనే జరిగిందని నివేదిక తెలిపింది. ఆహార ద్రవ్యోల్బణం 4.8%కి చేరింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు కూడా పెరిగాయని, దీని ప్రభావం రెస్టారెంట్, హోటల్ సేవల ధరలపై పడిందని పేర్కొంది. కోర్ ద్రవ్యోల్బణం కూడా 3.9%కి పెరగడం వల్ల ఆర్థిక వ్యవస్థలో మూల ధరల ఒత్తిడి పెరుగుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని నివేదిక తెలిపింది. ఇక ముందు రోజుల్లో ఇంధన ధరల పెరుగుదల, వాతావరణ మార్పుల ప్రభావం ఆహార ధరలపై మరింత ఒత్తిడిని కలిగించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు

**కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం**

తాడేపల్లి, జూన్ 14 (ఈవార్తలు): వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

## రేవంత్.. దమ్ముంటే ఎన్నికలకు రా!

**సీఎంకు ఎంపీ రఘునందన్ సవాల్**

మెదక్, జూన్ 14 (ఈవార్తలు): ప్రజల సంక్షేమమే ముఖ్య లక్ష్యంగా మోడీ 12 ఏళ్ల పాలన కొనసాగుతుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్ట మొదటి సరిగా 1952 లో ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికలు జరిగాయని, అంతకంటే ముందు ఓటు చోరీ, సీటు చోరీ చేసి దొడ్డిదారిన పండిత్ జవహర్ లాల్ నెహ్రూ అయ్యారని అన్నారు. ప్రజాస్వామ్యబద్దంగా ప్రజల ఓట్లతో ఎక్కువ కాలం ప్రధానమంత్రిగా సేవ చేస్తున్న ఏకైక వ్యక్తి నరేంద్ర మోడీ అన్నారు. ప్రధాని నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. జనధన్ ఖాతాలు, డిజిటలైజేషన్, జాతీయ రహదారుల విస్తరణ, రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీ పాలనలో దేశ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. తెలంగాణలో సీఎం నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకోలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పెరుగుతుందని అన్నారు. సీఎం రేవంత్ ఏం చేశారని 8 మంది ఎంపీలు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. రేవంత్ మరోసారి అధికారంలోకి వస్తానని చెబుతున్న ఉత్తరకుమారుడి మాటలు నిజమైతే మేము 8 మంది ఎంపీ రాజీనామా చేస్తామని దమ్ముంటే శాసనసభ రద్దు చేసి మాతో పాటు మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు. అలాగే కాంగ్రెస్ పాలనలో దేశ మహనీయులకు తగిన గుర్తింపు లభించలేదని, వంటి నేతల సేవలను విస్మరించారని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం దేశ సమగ్ర అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో మరోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ చీకోటి ప్రవీణ్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి లు సురేష్, శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, మండల అధ్యక్షరాలు బెండ వీణ, కౌన్సిలర్స్ కవిత రెడ్డి, మల్లికా, సంగీత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య రంగంలోనూ ఏఐ సేవలు

**మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటన**

హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రభుత్వ వైద్య రంగాన్ని అత్యాధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ, త్వరలోనే జిల్లా ఆస్పత్రుల్లోనూ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. హైటెక్ సిటీ యశోద ఆస్పత్రిలో జరిగిన 'ఆరోగ్య రంగంలో ఏఐ' సదస్సు ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కృత్రిమ మేధస్సు వైద్యులను భర్తీ చేయదని, వారి సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఎక్స్‌రేల ఏఐ విశ్లేషణ, సెప్సిస్, ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులను ముందే గుర్తించే సాంకేతికతలను ప్రవేశపెట్టామన్నారు. భవిష్యత్ వైద్యులను ఏఐ యుగానికి సిద్ధం చేసేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, సిమ్యులేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఫార్మా, బయోటెక్నాలజీ, వ్యాక్సిన్ తయారీ, వైద్య పరిశోధన రంగాల్లో గ్లోబల్ హబ్‌గా ఉన్న హైదరాబాద్, త్వరలోనే ఏఐ హెల్త్‌కేర్ పరిష్కారాలకు కూడా ప్రపంచ కేంద్రంగా మారుతుందని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.






## మళ్లీ పాఠశాల రోజుల్లోకి..!

**వాణీ విద్యాలయ పూర్వ విద్యార్థుల సందడి**

మల్యాల, జూన్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల కేంద్రంలోని వాణీ విద్యాలయంలో 2001-02 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాల అనంతరం దాదాపు 40 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల జీవితానికి సంబంధించిన అనేక సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, ఫోటో సెషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేసిన ఈ సమ్మేళనం ఆహ్లాదకర వాతావరణంలో ముగిసింది.




## మంచిర్యాల జిల్లా ఎస్పీఎస్ కమిటీ ఏర్పాటు

మంచిర్యాల, జూన్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్‌లు, బెడ్ సైడ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఎస్పీఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య స్పష్టం చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో ఎస్పీఎస్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కుర్రి సైదయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న బొస్క నరేష్ ఆధ్వర్యంలో ఈ కమిటీ నిర్మాణ కార్యక్రమం జరిగింది. జిల్లా స్థాయిలో నరేశ్ అధ్యక్షుడిగా, ప్రశాంత్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మొత్తం 13 మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుర్రి సైదయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సుమారు 18,000 మంది కార్మికులకు గుర్తింపు కార్డులు, భద్రత, కనీస వేతన పెంపు వంటి అంశాలపై పలుమార్లు ఆరోగ్య శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్మికులను ఐఎఫ్ఎంఐఎస్ వ్యవస్థలో విలీనం చేసి "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇదే విధమైన నిర్లక్ష్యం కొనసాగిందని ఆరోపించారు. జూలై నెలాఖరు వరకు ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే, రాష్ట్ర, జిల్లా కమిటీలతో చర్చించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వైనాల రవి, మాతంగి అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు కుమార్, పీ అంజలి, సంతోష్‌తో పాటు వివిధ జిల్లాల నాయకులు, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రులకు చెందిన వందలాది మంది వైద్య కార్మికులు పాల్గొన్నారు.

## తిరుమలలో జనసేన కార్యకర్తల అత్యుత్సాహం

తిరుమల, జూన్ 14 (ఈవార్తలు): కలియుగ వైకుంఠం, కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం కొలువైన తిరుమల క్షేత్రంలో కొందరు జనసేన కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు ప్రదర్శించిన అత్యుత్సాహం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అత్యంత పవిత్రంగా భావించే శ్రీవారి ఆలయ సమీపంలో నిబంధనలను బేఖాతరు చేస్తూ రాజకీయ వివరాల్లోకి వెళితే.. కొందరు జనసేన కార్యకర్తలు తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలో 'పవన్ కల్యాణ్ అనే నేను' అనే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ వీడియో రీల్స్ చిత్రీకరించారు. ఈ పుస్తకాన్ని ప్రమోట్ చేసే ఉద్దేశంతో వారు ఈ చర్యకు పాల్పడ్డారు. ఆలయ పరిసరాల్లో మొబైల్ ఫోన్లు వాడటం, వీడియోలు తీయడం పూర్తిగా నిషేధం అని తెలిసినప్పటికీ, వారు ఈ నిబంధనలను ఉల్లంఘించారు.



## మేలో బాలెనో అమ్మకాలు అదుర్స్

**18,398 యూనిట్లతో అగ్రస్థానం**

**అమ్మకాల్లో తొలి నాలుగు స్థానాలు మారుతివే**

ముంబై: భారత ఆటోమొబైల్ మార్కెట్లో మారుతి సుజుకి తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. మే 2026 నెలలో అత్యధికంగా అమ్ముడైన హ్యాచ్‌బ్యాక్ కార్ల జాబితాలో మారుతి మోడళ్లే అగ్రస్థానంలో నిలిచాయి. ఈసారి మారుతి వ్యాగనార్‌ను వెనక్కి నెట్టి, మారుతి బాలెనో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. విక్రయాల గణాంకాల ప్రకారం, మే నెలలో మారుతి సుజుకి బాలెనో మొత్తం 18,398 యూనిట్ల అమ్మకాలతో అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే బాలెనో అమ్మకాలు ఏకంగా 58 శాతం పెరగడం గమనార్హం. ఇక, 18,076 యూనిట్లతో మారుతి వ్యాగనార్ రెండో స్థానంలో నిలిచింది. దీని అమ్మకాలు కూడా 30 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ జాబితాలో మారుతి సుజుకి స్విఫ్ట్ 17,519 యూనిట్లతో మూడో స్థానంలో, మారుతి ఆల్టో 9,887 యూనిట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి. దీంతో టాప్-4 స్థానాలను మారుతి సుజుకి కైవసం చేసుకుని మార్కెట్లో తన పట్టును చాటుకుంది. టాటా మోటార్స్, హ్యుందాయ్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, మారుతి కార్ల అమ్మకాలపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. టాటా టియాగో, హ్యుందాయ్ ఐ20 వంటి మోడళ్లు అమ్మకాల్లో నిలకడగా రాణిస్తున్నా, మారుతి కార్ల ధాటికి టాప్ స్థానాలకు దూరంగానే నిలిచిపోయాయి. ఇక మారుతి బాలెనోకు రీబ్యాడ్జ్ వెర్షన్‌గా వచ్చిన టయోటా గ్లాంజా కూడా మంచి అమ్మకాలనే నమోదు చేస్తోంది. మొత్తం మీద, ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్ మంచి పనితీరు కనబరుస్తుండటం పరిశ్రమకు సానుకూల సంకేతంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## నౌకల కదలికలపై ఇరాన్ కఠిన చర్యలు



టెహ్రాన్: అంతర్జాతీయ చమురు, సహజ వాయువుల రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఈ వ్యూహాత్మక జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేసింది. ఈ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలు హోర్మూజ్ జలసంధి వైపు రావద్దని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నావికాదళం హెచ్చరికలు జారీ చేసింది. పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్ ద్వారా ఇరాన్ నావికాదళం పంపిన ఈ హెచ్చరికల ఆడియో రికార్డింగ్ ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక సిబ్బంది అందించిన ఆడియో రికార్డింగ్ ప్రకారం.. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ పరిధిలో ఉన్న అన్ని నౌకలను ఉద్దేశించి ఐఆర్‌జీసీ హెచ్చరికలు జారీ చేసింది. "హర్మూజ్ జలసంధిని ప్రస్తుతం పూర్తిగా మూసివేయడం జరిగింది. ఈ జలసంధి గుండా ఎలాంటి నౌకల కదలికలు ఉన్నా వాటిని చాలా కఠినంగా ఎదుర్కొంటాం. మీ ఆరోగ్యం, భద్రత దృష్ట్యా, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హర్మూజ్ జలసంధి వైపు రాకుండా దూరంగా ఉండండి" అని ఆ రేడియో సందేశంలో ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు క్షేత్రస్థాయిలో ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. హర్మూజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ పంపిన పలు డ్రోన్లను తాము విజయవంతంగా కూల్చివేసినట్లు అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి ప్రకటించింది. అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. జూన్ 11 నాటికి హర్మూజ్ జలసంధి, పశ్చిమాసియా పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ నౌకలపై 46 దాడులు జరిగాయి. ఈ దాడుల వల్ల ఇప్పటివరకు 14 మంది అంతర్జాతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఒక చమురు ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ముగ్గురు నావికులు మరణించగా, ఆ దాడిని తామే చేసినట్లు అమెరికా సైన్యం ఆ తర్వాత ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగబోయే శాంతి ఒప్పందం కోసం అంతర్జాతీయ వాణిజ్య వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# మేం హిట్లర్‌లా కాదు

**చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయి.. మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌తో చర్చల ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంచాలంటూ ఆర్ఎస్ఎస్ నాయకుడు దత్తాత్రేయ హోసబలే చేసిన వ్యాఖ్యలు ఇటీవల ఆసక్తికరంగా మారాయి. ఆ వ్యాఖ్యలను ఆర్ఆర్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా సమర్థించారు. అయితే, ఆ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రజలను ఉద్దేశించి చేసినవే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్‌కు స్వతంత్ర విదేశాంగ విధానమేమీ లేదని, పాకిస్థాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో తాము హిట్లర్‌లా వ్యవహరించబోమంటూ చెప్పారు. మే నెలలో దత్తాత్రేయ హోసబలే ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని భారత్ ఎలా ఎదుర్కోవాలి అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా దేశ భద్రత, ఆత్మ గౌరవాన్ని కాపాడుతూనే పాకిస్థాన్‌తో సంభాషణల ద్వారాలు మూసివేయకూడదని ఆయన అన్నారు. చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉండాలని చెప్పారు. సబలే వ్యాఖ్యలను సమర్థించిన మోహన్ భగవత్ పాకిస్థాన్‌లో కూడా భారత విభజన జరిగి ఉండకూడదు అని భావించే అనేక మంది ఉన్నారని చెప్పారు. రెండు దేశాల సిద్ధాంతానికి వ్యతిరేకంగా కలిసి జీవించడం మంచిదని భావించే వర్గం ఇప్పటికీ అక్కడ ఉందన్నారు. "పాకిస్థాన్‌లో చాలా మంది భారత విభజన తప్పు అని నమ్ముతున్నారు. అక్కడ ఉండే కొందరు జర్నలిస్టులు ఆర్ఎస్ఎస్ పనిని ప్రశ్నిస్తున్నారు. రెండు దేశాల సిద్ధాంతానికి వ్యతిరేకంగా కలిసి జీవించడం మంచిదని భావించే వర్గం అక్కడ ఉంది" అని ఆయన చెప్పారు. భవిష్యత్‌లో భారత్ పాకిస్థాన్‌ను పూర్తిగా ఓడించే పరిస్థితులు వచ్చినా అక్కడి ప్రజలను భారత్‌లో కలుపుకోవాల్సి రావొచ్చు లేదా వారిని అక్కడే శాంతియుతంగా జీవించనివ్వాల్సి రావొచ్చని మోహన్ భగవత్ అభిప్రాయపడ్డారు. "మేం హిట్లర్‌లా కాదు. అది మా స్వభావం కాదు. మా మార్గం కాదు. అందుకే కొన్ని ద్వారాలు ఎప్పుడూ తెరిచి ఉంచాలి. అన్యాయం, దౌర్జన్యాన్ని ఓడించాలి. కానీ మంచిని కూడా కాపాడాలి" అని చెప్పారు. పాకిస్థాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకే తాము మద్దతు ఇస్తామని మరోసారి స్పష్టం చేశారు.

# మోదీ బలహీన ప్రధాని

**దేశాన్ని కాపాడలేడు: రాహుల్ గాంధీ**



న్యూఢిల్లీ: హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. "అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. "అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు" అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే, దేశాన్ని అవమానించే వాళ్లే ఆయన నియంత్రణలో ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం "ఇది సమర్థనీయం కాదు" అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు. మరోవైపు, ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

# జులై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియలు



టెహ్రాన్: ఇరాన్ దేశాన్ని సుదీర్ఘ కాలం పాటు పరిపాలించిన మాజీ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల అధికారిక షెడ్యూల్ ఖరారైంది. వచ్చే నెల (జులై) 4వ తేదీ నుంచి రాజధాని టెహ్రాన్‌లో ఈ అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభం కానుందని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ఆదివారం వెల్లడించింది. ఖమేనీ సంస్మరణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ప్రధాన కమిటీ ఈ మేరకు ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ప్రకటన వివరాల ప్రకారం.. జులై 4, 5 తేదీలలో టెహ్రాన్‌లోని ప్రసిద్ధ ఇమామ్ ఖమేనీ ముసల్లా ప్రార్థనా మందిరంలో ఖమేనీ పార్థివ దేహానికి వీడ్కోలు వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం జులై 6, 7 తేదీలలో రాజధాని టెహ్రాన్, పవిత్ర నగరం కోమ్ లలో భారీ అంతిమ యాత్రలు సాగుతాయి. 9న దేశ ఈశాన్య ప్రాంతంలోని మషద్ నగరంలో తుది వీడ్కోలు కార్యక్రమం ముగుస్తుంది. అదే రోజున షియా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఎనిమిదో ఇమామ్ 'ఇమామ్ రెజా' పవిత్ర క్షేత్రంలో ఖమేనీ దేహాన్ని ఖననం చేయనున్నారు. నిజానికి మార్చి నెలలోనే జరగాల్సిన ఈ అంత్యక్రియలు యుద్ధ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చాయి.



## చారిత్రక విల్లా కెర్లియోస్‌లో మోదీ పర్యటన

**మేక్రాన్‌తో కలిసి సెల్ఫీ**

**'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమం ప్రారంభం**

నీస్: ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

# ప్రజా నాయకుడు భట్టి

## కష్టాల కొలిమిలో కాగిన నేత

## పాదయాత్రతో ప్రజల చెంతకు

## నేడు డిప్యూటీ సీఎం పుట్టిన రోజు

తెలంగాణ రాజకీయ యవనికపై ప్రజల నాడిని పట్టి చూసి, వారి గుండె చప్పుడును పాలనా విధానాలుగా మలచగల అరుదైన ప్రజా నాయకుడు మల్లు భట్టి విక్రమార్క. కేవలం అధికార పీఠాలకే పరిమితం కాకుండా, నిరంతరం జనం మధ్య నడుస్తూ, జనంతోనే శ్వాసిస్తూ అసాధారణ ప్రజాదరణను సొంతం చేసుకున్నారాయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రభుత్వ ప్రధాన విప్, డిప్యూటీ స్పీకర్‌గా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎల్పీ నేతగా, ప్రతిపక్ష నాయకుడిగా ఆయన అందించిన సేవలు రాజకీయ శ్రేణులకు దిక్సూచిగా మారాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రిగా అత్యంత కీలక బాధ్యతలు నిర్వహిస్తూ, రాష్ట్ర సమగ్ర పునర్నిర్మాణానికి ఆయన అహర్నిశలు కృషి చేస్తున్నారు. జూన్ 15, 2026 సోమవారం నాడు ఆయన 65వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మల్లు భట్టి విక్రమార్క 1961 జూన్ 15న ఖమ్మం జిల్లా వైరా మండలం పరిధిలోని స్నానాల లక్ష్మీపురం అనే ఒక సాధారణ గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మల్లు అఖిలాండ, మల్లు మాణిక్యం. తండ్రి మాణిక్యం వ్యవసాయ వృత్తిని కొనసాగిస్తూనే గ్రామీణ వైద్యుడిగా (ఆయుర్వేదం) పేదలకు ఎనలేని సేవలు అందించేవారు. నాటి సామాజిక-ఆర్థిక అసమానతలు, రవాణా సౌకర్యాల లేమి వంటి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూనే భట్టి విక్రమార్క తన ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. పాఠశాలకు వెళ్లేందుకు ప్రతిరోజూ కాలినడకన దాదాపు ఏడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. ఈ బాల్య అనుభవాలు, పల్లెటూరి కష్టాలు ఆయనలో క్షేత్రస్థాయి ప్రజల అవసరాలు మరియు అణగారిన వర్గాల సమస్యలపై లోతైన సానుభూతిని, అవగాహనను నింపాయి. అందుకే భట్టి విక్రమార్క గారికి ప్రజల కష్టాలు కేవలం అధికారుల నివేదికల ద్వారా 'వినిపించేవి' కావు.. స్వయంగా 'అనుభవించినవి.



### 'పీపుల్స్ మార్చ్'.. ఒక నిశ్శబ్ద విప్లవం

రాజకీయాల్లో యాత్రలు చేయడం ఒక ఎత్తు.. కానీ భట్టి విక్రమార్క గారు చేపట్టిన "పీపుల్స్ మార్చ్" పాదయాత్ర తెలంగాణ రాజకీయ చరిత్రను మలుపు తిప్పిన ఒక మైలురాయి. 2019లో కాంగ్రెస్ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ, అధిష్టానం ఆదేశంతో సీఎల్పీ నేతగా భట్టి బాధ్యతలు చేపట్టి, అసెంబ్లీలో నాటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గర్జించారు. ఆ గర్జనే క్షేత్రస్థాయిలో 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రగా రూపాంతరం చెందింది. 2023 మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా పిప్రి గ్రామంలో ప్రారంభమైన ఈ సుదీర్ఘ పాదయాత్ర 109 రోజుల పాటు, 36 నియోజకవర్గాల్లోని 600 పైగా గ్రామాలను తాకుతూ 1,365 కిలోమీటర్ల మేర సాగింది. ఎండను, వానను లెక్కచేయక సాగిన ఈ యాత్రలో నాటి ధరణి పోర్టల్ లోపాలు, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దగాను ప్రజల తరఫున నిలబడి ఎండగట్టారు. దేవరకొండ సమీపంలో 1,000 కిలోమీటర్ల మైలురాయి దాటినందుకు గుర్తుగా ప్రత్యేక స్థూపాన్ని ఆవిష్కరించారు. జూలై 2, 2023న ఖమ్మంలో రాహుల్ గాంధీ గారి సమక్షంలో ముగిసిన ఈ యాత్రే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బలమైన పునాది వేసింది.



# హైదరాబాద్ ఆత్మ..

# సాలార్ జంగ్ మ్యూజియం

## ప్రపంచ నాగరికతలను భద్రపరిచిన మ్యూజియం.. లౌకికత్వానికి సజీవ సాక్ష్యం అక్కడి ఆనవాళ్లు

### వారసత్వ సంపదతో వేలాది మందికి జీవనోపాధి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**నగరం కొన్ని సంస్థలను నిర్మిస్తే.. మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సాలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ నగర ఆత్మకు ప్రతిరూపమని అన్నారు. సాలార్ జంగ్ మ్యూజియం 75వ వసంతాల వేడుకలతో పాటు, మీర్ యూసుఫ్ అలీఖాన్ (సాలార్ జంగ్-3) 137వ జయంతి ఉత్సవాల్లో ఆయన ఆదివారం నాడు పాల్గొన్నారు**

. ఈ సందర్భమగా ఆయన మాట్లాడు తూ.. ప్రపంచాన్ని ఒడిసిపట్టిన మహోన్నత వ్యక్తి సాలార్ జంగ్-3 అన్నారు. సాధారణంగా మనం మన కళ్ళజోడు, మొబైల్ ఫోన్, కార్ కీస్ లాంటి చిన్న వస్తువులనే మర్చిపోతుం టాం. కానీ సాలార్ జంగ్-3 ఏకంగా ప్రపంచ నాగరికతలనే భద్రపరిచారని అన్నారు. 43 వేల కళాఖండాలను సేకరించడం అంటే అది కేవలం సేకరణ కాదు.. కళలపై ఆయనకున్న అపారమైన భక్తి అని చెప్పారు.



హైదరాబాద్, జూన్ 14 (ఈవార్తలు): ప్రపంచంలోని అరుదైన సౌందర్యాన్ని, చరిత్రను తన సొంత నిధుల నుంచి సేకరించి.. వాటన్నింటినీ ప్రజల ఆస్తిగా మార్చిన ఆయన ఉదారత సాటిలేనిదిని చెప్పారు. ఈ మ్యూజియంలో హిందువుల కాంస్య విగ్రహాలు, పవిత్ర ఖురాన్ ప్రతిమలు, క్రైస్తవ మడోన్నా శిల్పాలు, బౌద్ధ కళాఖండాలు ఒకే చోట కొలువై ఉన్నాయని చెప్పారు. విష్ణుమూర్తి దశావతారాలు, ఖురాన్ శ్లోకాలు కలిసి ఉన్న ఆచార వస్తువులు ఇక్కడి ప్రత్యేకతగా ఆయన అభివర్ణించారు. ఇది మత సామరస్యానికి ప్రసంగం కాదు.. లౌకికత్వానికి సజీవ సాక్ష్యం. ఇదే దక్కన్ గంగా-జమునా తెహజీబ్ అని చెప్పారు. మ్యూజియం పక్కనే ప్రవహించే మూసి నది అంటే హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహం అని అన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసి నదిని ప్రక్షాళన చేసి, లండన్ లోని థేమ్స్, పారిస్ లోని సీన్ నది తరహాలో అంతర్జాతీయ స్థాయి రివర్ ఫ్రంట్‌గా మార్చడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాలార్ జంగ్ మ్యూజియం కేవలం ఒక ఒంటరి భవనంగా కాకుండా.. అభివృద్ధి చెందిన మూసి రివర్ ఫ్రంట్‌కు ఒక సాంస్కృతిక కిరీటంగా మారబోతోందన్నారు. పర్యాటకులు నది గుండా ప్రయాణిస్తూ, ఇక్కడి వారసత్వ వీధుల్లో నడుస్తూ, చారిత్రక కళాఖండాలను వీక్షించేలా ఒక అద్భుతమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ అంటే కేవలం చార్మినార్ మాత్రమే కాదు.. సైబర్ టవర్స్ నగరం కూడా అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ అంతే వేగంగా ఎదుగుతోందిని చెప్పారు. బిర్యానీతో పాటు బయోటెక్నాలజీ, ఐటీ, ఫార్మా రంగాల్లో గ్లోబల్ పవర్‌హౌస్‌గా ఉన్నాం. హైదరాబాద్ ఎప్పుడూ చరిత్రకు, భవిష్యత్తుకు మధ్య దేనినో ఒకదానినే ఎంచుకోలేదు.. రెండింటినీ రెండు చేతులా గుండెకు హత్తుకుందన్నారు. చార్మినార్, గోల్కొండ, కుతుబ్ షాహీ సమాధులు, చౌమహల్లా, ఫలక్‌నుమా ప్యాలెస్‌లతో కూడిన ఓల్డ్ సిటీ హెరిటేజ్ సర్క్యూట్‌ను సాలార్ జంగ్ మ్యూజియంతో అనుసంధానిస్తామని అన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు, నైట్ టూరిజం, తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో గైడెడ్ వాక్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వారసత్వం అనేది కేవలం గర్వపడటానికే కాదు.. స్థానిక గైడ్‌లు, కళాకారులు, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి జీవనోపాధి కల్పించడానికి ఉపయోగపడాలన్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ వరకు ప్రతి విద్యార్థి ఈ మ్యూజియాన్ని సందర్శించి 'ఇది నా ఆస్తి' అనే ఆత్మవిశ్వాసాన్ని పొందాలన్నారు. మ్యూజియం అనేది నిశ్శబ్దంగా ఉండే ప్రదేశం కాకూడదన్నారు. మ్యూజియం అనేది ప్రశ్నలతో సజీవంగా ఉండాలి. ఇందుకోసం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో ప్రత్యేక భాగస్వామ్యం కుదుర్చుకుంటామని చెప్పారు. అలాగే హైదరాబాద్‌కు ఐటీ, బిజినెస్ పనుల మీద వచ్చే గ్లోబల్ ఇన్వెస్టర్లు కేవలం బోర్డ్‌రూమ్‌లకే పరిమితం కాకుండా.. కనీసం ఒక రోజు సాలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించి, చార్మినార్ వద్ద ఇరానీ చాయ్ తాగి ఇక్కడి సంస్కృతిని ఆస్వాదించాలని ఆయన కోరారు. మన బిర్యానీ, హలీమ్, చాయ్ కేవలం ఆహార పదార్థాలు కావు.. తెలంగాణ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలన్నారు. ఈ 75 ఏళ్ల ప్రయాణంలో మ్యూజియాన్ని కాపాడుకుంటూ వస్తున్న క్యూరేటర్లు, కన్సర్వేటర్లు, సెక్యూరిటీ, క్లీనర్లు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కు డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. మీరే హైదరాబాద్ జ్ఞాపకాలకు అసలైన కాపలాదారులు. సాలార్ జంగ్-3 సేకరించిన ఈ అమూల్యమైన సంపదను మరింత ఆధునీకరించి, భవిష్యత్తు తరాలకు సగర్వంగా అందించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.




ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
సోమవారం 15-6-2026, జగిత్యాల
www.evarthalu.com


లవ్లీ చిత్రం






## అత్తగారి ఊరిలో రష్మిక సర్‌ప్రైజ్

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల అభిమానులకు సరికొత్త సర్‌ప్రైజ్ లభించింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉండి, ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంతో ఒకటైన ఈ జంటకు సంబంధించి ఒక ఆసక్తికర వార్త నెట్టింట వైరల్‌గా మారింది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత భర్త పేరునో లేదా వారి ఇంటిపేరునో తమ పేరు పక్కన చేర్చుకోవడం చూస్తుంటాం. అయితే, వివాహం తర్వాత కూడా రష్మిక తన సోషల్ మీడియా ఖాతాల్లో పాత పేరునే కొనసాగించడంతో, ఆమె పేరు మార్చుకోరని అందరూ భావించారు. కానీ, తాజాగా రష్మిక అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భర్త ఇంటిపేరును తన పేరుకు జోడించి అఫీషియల్‌గా ప్రకటించారు. ఆదివారం విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక తన అత్తగారి సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా తుమ్మన్‌పేట గ్రామాన్ని సందర్శించారు. అక్కడ 'ది దేవరకొండ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 2026 విద్యా సంవత్సరానికి గానూ 9, 10వ తరగతుల్లో అత్యుత్తమ మార్కులతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు (స్కాలర్‌షిప్స్) అందించే కార్యక్రమం జరిగింది. అయితే ఈ వేదికపై రష్మిక మాట్లాడుతూ తనను తాను మొదటిసారిగా 'రష్మిక మందన్న దేవరకొండ'గా పరిచయం చేసుకుని అక్కడి వారందరినీ ఆనందంలో ముంచెత్తారు. ఈ రోజు మీ ముందు ఇలా మాట్లాడటం చాలా సంతోషంగా ఉందన్న ఆమె, కష్టపడి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. జీవితంలో గెలుపోటములు సహజమని, ప్రతి అనుభవం నుండి పాఠాలు నేర్చుకుంటూ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు హితవు పలికారు. బహిరంగ వేదికపై రష్మిక తన పేరును మార్చి పలకడం ఇదే తొలిసారి కావడంతో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## బుచ్చిబాబు సారీ చెప్పడం నచ్చలేదు: అనంత్ శ్రీరాం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. కథ, భావోద్వేగాలు, రామ్ చరణ్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కినా, సినిమాలో జాన్వీ కపూర్ పోషించిన అచ్చియమ్మ పాత్రపై మాత్రం కొంత వివాదం నెలకొంది. ముఖ్యంగా ఆమె పాత్రను అవసరానికి మించి గ్లామరస్‌గా చూపించారని, కొన్ని సన్నివేశాల్లో పాత్రను సెక్సువలైజ్ చేశారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విమర్శల నేపథ్యంలో దర్శకుడు బుచ్చిబాబు సాన గతంలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఎవరి మనోభావాలైనా దెబ్బతిన్నట్లయితే క్షమాపణలు కోరుతున్నానని ట్వీట్ చేశారు. అయితే తాజాగా నిర్వహించిన 'పెద్ది' సక్సెస్ ప్రెస్‌మీట్‌లో ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ బుచ్చిబాబు క్షమాపణ చెప్పడం తనకు నచ్చలేదని స్పష్టం చేశారు. ఒక పాత్ర ఎలా ప్రవర్తించాలి, ఎలా మాట్లాడాలి అనేది పూర్తిగా దర్శకుడి ఊహాశక్తి, కథకు సంబంధించిన అంశమని అన్నారు. ఇప్పుడు సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు చెప్పే అభిప్రాయాలే అంతిమ సత్యాలుగా మారిపోతున్నాయి. ఒక దర్శకుడు పాత్రను తన దృష్టికోణంలో ఎలా మలచాలనుకుంటాడో ఆ స్వేచ్ఛ లేకపోతే సృజనాత్మకతకు పెద్ద నష్టం జరుగుతుంది అని వ్యాఖ్యానించారు. అలాగే సినిమాల్లో ఇంగ్లీష్ పదజాలం లేదా ఆధునిక భావజాలంతో కూడిన సంభాషణలు వస్తే వాటిని కళాత్మకంగా స్వీకరించే కొందరు, గ్రామీణ నేపథ్యంలోని పాత్రలు తమ సహజ భాషలో మాట్లాడితే మాత్రం వల్గారిటీగా చూస్తున్నారని అభిప్రాయపడ్డారు. అనంత శ్రీరామ్ తన వ్యాఖ్యల్లో మరింత ఘాటుగా స్పందించారు. ప్రతి పాత్రను ఒకే కోణంలో చూడడం సరైంది కాదు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పాత్ర తన స్వభావానికి తగ్గట్టుగా మాట్లాడితే దానిని ఆబ్జెక్టిఫికేషన్‌గా చూడటం సరికాదు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే



భవిష్యత్తులో డాక్యుమెంటరీలు తప్ప కమర్షియల్ సినిమాలు చేయడం కష్టమవుతుంది అని అన్నారు. అలాగే ఇటీవల థియేటర్లలో ప్రేక్షకులను కలిసిన సమయంలో చాలామంది మహిళలు కూడా బుచ్చిబాబును కలిసి "మీరు ఎందుకు సారీ చెప్పారు? మాకు ఆ పాత్రలో ఎలాంటి అభ్యంతరం అనిపించలేదు" అని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.



## శ్రీలీల నువ్వు అరుదైన రత్నం

టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియా మొత్తం శుభాకాంక్షలతో మార్మోగుతోంది. సినీ ప్రముఖులు, అభిమానులు, సన్నిహితులు ఆమెకు బర్త్‌డే విషెస్ చెబుతుండగా, హీరో రానా దగ్గుబాటి సతీమణి మిహికా బజాజ్ చేసిన ప్రత్యేక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. శ్రీలీలను తన "ఫేవరెట్ గర్ల్" అంటూ సంబోధించిన మిహికా, ఆమె వ్యక్తిత్వం, కష్టపడే తత్వం, మంచితనంపై ప్రశంసల వర్షం కురిపించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మిహికా, ఆమెను కేవలం విజయవంతమైన నటిగానే కాకుండా గొప్ప మనసున్న వ్యక్తిగా అభివర్ణించారు. ప్రతి రోజూ నీ చుట్టూ ఉన్నవారికి నువ్వు స్ఫూర్తిగా నిలుస్తావు.

## 180 మంది విద్యార్థులకు విరోష్ స్కాలర్‌షిప్స్

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట, గతంలో తమ ఫామ్‌హౌస్‌లో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకున్న సందర్భంగా ఒక కలల ప్రాజెక్ట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనను నిజం చేస్తూ, విజయ్ దేవరకొండ తన తండ్రి పుట్టిన సొంత ఊరైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని తుమ్మన్‌పేట గ్రామానికి రష్మికతో కలిసి ఆదివారం విచ్చేశారు. పెళ్లి తర్వాత మొదటిసారిగా రష్మికతో కలిసి సొంతూరికి వచ్చిన విజయ్, గ్రామాభివృద్ధిపై తనకున్న ఆలోచనలను అక్కడి ప్రజలతో పంచుకోబోతున్నట్లు తెలుస్తుంది.



## నరకం చూశా

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ప్రస్తుతం 'ఓ సుకుమారి' షూటింగ్‌లో ఫుల్ బిజీ అయిపోయింది. ఇందులో తిరువీర్ సరసన రొమాన్స్ చేయనుంది. భరత్ దర్శన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వరరెడ్డి మాలి నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య రాజేష్ తన జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుని ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఒకానొక దశలో తనకు అవకాశాలు లేకపోవడం వల్ల తాను దాదాపు ఆరు నెలల పాటు ఇంట్లోనే ఉన్నట్లు తెలిపింది. అవకాశాలు వచ్చినప్పటికీ తనకు నచ్చిన పాత్రలు, చేయాలని భావించిన కథలు తన వద్దకు రాలేదని అందుకే వచ్చిన వాటిని అంగీకరించలేదని చెప్పింది. నటిగా ప్రతి ఒక్కరి జీవితంలో హై పాయింట్స్, లో పాయింట్స్ ఉంటాయని తన కెరీర్‌లో కూడా అలాంటి పరిస్థితులను తాను చాలాసార్లు ఎదుర్కొన్నట్లు వివరించింది. ఖాళీగా ఉన్న ఆరు నెలలు తాను చాలా ఆందోళనకు గురయ్యాయని ఎమోషనల్ అయింది. మంచి అవకాశాలు రావడం లేదా? లేక తన సినీ కెరీర్ అక్కడితోనే ముగిసిపోతుందా? అనే ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపింది. నటికి అవకాశాలు లేకపోవడంతో ఆ సమయంలో నరకం చూశానని అన్నారు. ఆ సమయంలోనే తనకు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటించే అవకాశం వచ్చిందని ఆ సినిమా తన జీవితాన్ని మార్చిందని పేర్కొంది. ఆరు నెలల తర్వాత మొదటిసారి షూటింగ్ సెట్‌లో పాల్గొన్న క్షణాలు తనకు ఇంకా గుర్తున్నాయని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఐశ్వర్య రాజేష్ ఓ సుకుమారితో పాటు మహేంద్ర గిరి వారాహి,అండర్-18, ధృవనక్షత్రం వంటి చిత్రాలు కూడా చేస్తోంది.





## జాన్వీ రేంజ్ మారిపోతుంది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలై రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా తాజాగా చిత్ర బృందం సక్సెస్ ప్రెస్ మీట్‌ను నిర్వహించగా.. దర్శకుడు బుచ్చిబాబు సానా సినిమాకు సంబంధించిన పలు ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. ఈ మేరకు ఐటెమ్ సాంగ్‌పై వస్తున్న విమర్శలపై మాట్లాడుతూ.. 'ఐటెమ్ సాంగ్‌ను ఐటెమ్ సాంగ్‌లాగే ఆస్వాదించాలి. విమర్శగానీ, ఆరోపణగానీ నిర్దిష్టంగా ఉండాలి. ప్రత్యేకంగా ఎజెండా పెట్టుకుని మాట్లాడితే దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. నిజాయితీగా అడిగిన వారికి సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటాను. అలాగే 'పెద్ది' సినిమాలో కొన్ని ఎటిట్ చేశాం. ఇందులో మొత్తం మూడు సన్నివేశాలు జోడించాం. హీరోయిన్‌కు సంబంధించిన మూడు సీన్లు, అలాగే జగపతిబాబు గారికి ఒక సీన్ ఉంటుంది. మిస్ అయిన అంశాలన్నీ అందులో ఉంటాయి. జాన్వీ పాత్రకు సంబంధించి మరో రెండు సన్నివేశాలు ఉన్నాయి. అవి చూసిన తర్వాత ప్రేక్షకులు ఆ పాత్రకు ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారు. బుధవారం నుంచి ఆ సన్నివేశాలు జోడిస్తాం. దాంతో జాన్వీ పాత్ర మరో స్థాయికి చేరుతుందని నమ్ముతున్నాను' అంటూ తెలిపారు.




## కామన్‌వెల్త్ స్క్వాడ్‌లో
# నీరజ్ చోప్రా

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కామన్‌వెల్త్ క్రీడలకు ఎంపికయ్యాడు. దోహా డైమండ్ లీగ్‌కు దూరమైన నీరజ్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ మెగా ఈవెంట్‌కు తీసుకుంది. ప్రస్తుతం వెన్ను గాయం నుంచి కోలుకుంటున్న చోప్రాపై భారీ అంచనాలే ఉన్నాయి. జూలై 23 నుంచి మొదలయ్యే కామన్‌వెల్త్ క్రీడల కోసం ఆదివారం 32 మందితో కూడిన అథ్లెటిక్స్ బృందాన్ని ప్రకటించింది ఏఎఫ్ఐ. ప్రతిష్ఠాత్మక కామన్‌వెల్త్ క్రీడలే లక్ష్యంగా ఫిట్‌నెస్ మెరగుపరచుకుంటున్న నీరజ్ చోప్రాకు స్క్వాడ్‌లో దక్కింది. ప్రస్తుతం స్విట్జర్‌లాండ్‌లో ఉన్న ఈ జావెలిన్ త్రోయర్‌తో పాటు 32 మంది స్క్వాడ్‌లోకి ఎంపికయ్యారు. ఇటీవలే 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు బద్ధలు కొట్టిన గురిందర్వీర్ సింగ్, 200 మీటర్లతో రాణించిన అనిమేశ్ కుజుర్‌లు పతక వేటకు సిద్ధమవుతున్నారు.

**కామన్‌వెల్త్ గేమ్స్ అథ్లెటిక్స్ స్క్వాడ్**

- గురిందర్వీర్ సింగ్ - 100 మీటర్లు
- అనిమేశ్ కుమార్ - 200 మీటర్లు
- గుల్వీర్ సింగ్ - 5000 మీటర్లు 10000 మీటర్లు
- తేజస్ అశోక్ షిర్సే - 110 మీటర్ల హర్డిల్స్
- యశస్ పి- 400 మీటర్ల హర్డిల్స్
- సంతోష్ కుమార్ తమిలసరన్ - 400 మీటర్ల హర్డిల్స్
- సర్వేశ్ అనిల్, ఆదర్శ్ రామ్, పూజ - హై జంప్
- దేవ్ మీనా - పోల్ వాల్ట్
- శ్రీ శంకర్ ఎమ్, లోకేశ్ సత్యనాథన్ - లాంగ్ జంప్
- ప్రవీణ్ ఛిత్రవేల్, సెల్వా ప్రభు - ట్రిపుల్ జంప్
- సమర్దీప్, తేజిందర్‌పాల్, మన్‌ప్రీత్ - షాట్ పుట్
- నీరజ్ చోప్రా, రోహిత్, యశ్ వీర్ - జావెలిన్ త్రో
- తేజస్విన్ శంకర్ - డెకాథ్లాన్ హై జంప్
- పరుల్ చౌదరీ - 3000 మీ. స్టీపుల్ ఛేజ్ 5000 మీ.
- సీమా పూనియా, నిధి రాణి - డిస్కస్ త్రో
- రవీనా, ప్రియాంక - 10000 మీ రేస్ వాక్









# పాక్ విలవిల

## తిప్పేసిన దీప్తి, చరణి.. దాయాదిపై భారత్ ఘన విజయం

**మహిళల టీ20 ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో 170 పరుగుల ఛేదనలో పాక్‌కు టీమిండియా స్పిన్నర్లు ముచ్చెమటలు పట్టించారు. బర్మింగ్‌హామ్‌లో స్పిన్నర్లు దీప్తి శర్మ(5-10). శ్రీ చరణి(3-21)లు దాయాది టాపార్డర్‌ను కూల్చివేయడంతో పాకిస్థాన్‌ను 64 పరుగుల తేడాతో ఓడించింది.**

**తొలుత ఓపెనర్ స్మృతి మంధాన(68) అర్ధ శతకంతో కదం తొక్కగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(36) కెప్టెన్ ఇన్నింగ్స్, రీచా ఘోష్() తుఫాన్ బ్యాటింగ్‌తో రెచ్చిపోయారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో భారత్ జయభేరి మోగించింది.**

మెగాటోర్నీలో దాయాదిపై రికార్డును కొనసాగిస్తూ హర్మన్‌ప్రీత్ సేన 64 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. 171 పరుగుల ఛేదనలో ఓపెనర్ మునీబా అలీ(41) ఒక్కామే దూకుడుగా ఆడినా.. దీప్తి శర్మ(5-10), శ్రీ చరణి(3-23)లు తిప్పేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు తిప్పారు. ఓవర్లో రెండు వికెట్లు తీసిన దీప్తి ఐదో వికెట్ సాధించింది. దాంతో, పాక్ అదే తడబాటుతో 110 పరుగులకే ఆలౌటైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాను ఆదిలోనే పాక్ బౌలర్లు కష్టాల్లోకి నెట్టారు. షఫాలీ వర్మ(5), జెమీమా రోడ్రిగ్స్(1)లు విఫలమైనా ఓపెనర్ స్మృతి మంధాన(68) నిలబడింది. దాయాది బౌలర్లను కాచుకున్న మంధాన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(36)తో కలిసి జట్టును ఆదుకుంది. కౌర్ స్టాండ్ ఇవ్వగా.. మంధాన అటాకింగ్ గేమ్‌తో పాక్ బౌలింగ్ దళాన్ని చీల్చి చెండాడింది. రెండుసార్లు మంధానను ఔట్ చేసే అవకాశాన్ని పాక్ ఫీల్డర్లు నేలపాలు చేశారు. బౌండరీలతో విరుచుకుపడిన మంధాన అర్ధ శతకంతో జట్టుకు మంచి స్కోరందించింది. కానీ, స్వల్ప తేడాకే కౌర్, మంధాన ఔటవ్వగా.. డెత్ ఓవర్లలో రీచా ఘోష్(34) బ్యాట్ ఝులిపించింది. దీప్తి శర్మ(12)తో కలిసి ధనాదన్ ఆడిన రీచా.. తస్మియా రుబాబ్ వేసిన 19వ ఓవర్లో 4, 6, 4, 4తో 23 రన్స్ పిండుకుంది. చివరి ఓవర్లో 15 పరుగులే రావడంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది.






## ఆస్ట్రేలియా చేతిలో టర్కీ చిత్తు

ఫిఫా వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా జట్టు శుభారంభం చేసింది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన గ్రూప్-డి ఓపెనింగ్ మ్యాచ్‌లో టర్కీపై 2-0 తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ బరిలోకి దిగిన టర్కీ జట్టుకు ఆస్ట్రేలియా యువ ఆటగాళ్లు గట్టి షాక్ ఇచ్చారు. మ్యాచ్ ప్రారంభమైన 27వ నిమిషంలోనే ఆస్ట్రేలియా యువ ఫార్వర్డ్ ఆటగాడు నెస్టోరీ ఇరాన్‌కుందా అద్భుతమైన కౌంటర్ ఎటాకింగ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ అద్భుత గోల్‌తో ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియా తరపున గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఇరాన్‌కుందా సరికొత్త రికార్డు సృష్టించాడు. ఆ తర్వాత టర్కీ ఆటగాళ్లు మ్యాచ్‌ను డ్రా చేయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆస్ట్రేలియా డిఫెన్స్ దాన్ని తిప్పికొట్టింది. ముఖ్యంగా 75వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ కానర్ మెట్‌కాఫ్ బాక్స్ వెలుపల నుండి ఒక అద్భుతమైన లో-షాట్‌తో రెండో గోల్ కొట్టి ఆస్ట్రేలియా విజయాన్ని పూర్తిగా ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 22 ఏళ్ల యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ అసాధారణ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. టర్కీ జట్టు చేసిన పలు ప్రమాదకరమైన గోల్ ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుని క్లీన్ షీట్ సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. ఈ ఘన విజయంతో ఆస్ట్రేలియా జట్టు గ్రూప్-డి లో 3 పాయింట్లతో టోర్నీని ఉత్సాహంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ గ్రూప్‌లో పరాగ్వేపై 4-1తో గెలిచిన అమెరికా జట్టు అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది.

## బ్రెజిల్-మొరాకో మ్యాచ్ డ్రా



ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్-సి ఓపెనింగ్ మ్యాచ్‌లో బ్రెజిల్, మొరాకో జట్ల మధ్య జరిగిన పోరు 1-1 తో డ్రాగా ముగిసింది. న్యూజెర్సీలోని స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు గట్టి పోటీని ఇచ్చాయి. మ్యాచ్ ప్రారంభమైన 20వ నిమిషంలో మొరాకో ఆటగాడు ఇస్మాయిల్ సైబారి ఒక అద్భుతమైన గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత బ్రెజిల్ జట్టు పుంజుకుని ఎదురుదాడికి దిగింది. మ్యాచ్ 31వ నిమిషంలో బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినిసియస్ జూనియర్ సూపర్ గోల్ చేయడంతో స్కోరు 1-1 తో సమమైంది. వినిసియస్ జూనియర్‌కు బ్రెజిల్ తరఫున ఇది 50వ మ్యాచ్ కాగా, అందులో ఆయన 10వ అంతర్జాతీయ గోల్‌ను నమోదు చేయడం విశేషం. తొలి అర్ధభాగంలో మొరాకో జట్టు మంచి ప్రతిభ కనబరిచినప్పటికీ, రెండో అర్ధభాగంలో ఇరు జట్లు తమ డిఫెన్స్‌ను బలోపేతం చేశాయి. రెండు జట్ల రక్షణ శ్రేణి అప్రమత్తంగా ఉండటంతో సెకండ్ హాఫ్‌లో ఒక్క గోల్ కూడా నమోదు కాలేదు. దీంతో మ్యాచ్ చివరి వరకు 1-1 తోనే నిలిచింది. ఈ డ్రాతో ఇరు జట్లు చెరో పాయింట్‌ను పంచుకున్నాయి. అలాగే వరల్డ్ కప్ చరిత్రలో 1934 నుండి సాగుతున్న తన అజేయ ఓపెనింగ్ రికార్డును బ్రెజిల్ మరోసారి కాపాడుకుంది.

## హైతీపై స్కాట్లాండ్ ఘనవిజయం



ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్-సి మొదటి మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు 1-0 గోల్స్ తేడాతో హైతీపై ఘనవిజయం సాధించింది. అమెరికాలోని బోస్టన్ స్టేడియంలో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో స్కాట్లాండ్ ఆటగాళ్లు మొదటి నుంచే మంచి ప్రతిభ కనబరిచారు. మ్యాచ్ 27వ నిమిషంలో స్కాట్లాండ్ స్టార్ ప్లేయర్ జాన్ మెక్‌గిన్ కొట్టిన షాట్, హైతీ డిఫెండర్‌ను తాకుతూ డిఫ్లెక్ట్ అయి గోల్‌గా మారింది. ఈ ఒక్క గోల్‌తో లభించిన ఆధిక్యాన్ని స్కాట్లాండ్ చివరి వరకు కాపాడుకుని విజేతగా నిలిచింది. ఈ గెలుపు స్కాట్లాండ్ జట్టుకు ఎంతో ప్రత్యేకం. ఎందుకంటే, 1990 ఇటలీ ప్రపంచకప్ తర్వాత వారు మెగా టోర్నీలో సాధించిన మొదటి విజయం ఇదే. అలాగే, 1998 తర్వాత స్కాట్లాండ్ ఆడుతున్న తొలి ప్రపంచకప్ మ్యాచ్ కూడా ఇదే కావడం విశేషం. మరోవైపు, సుమారు 50 ఏళ్ల (1974) తర్వాత వరల్డ్ కప్‌లోకి అడుగుపెట్టిన హైతీ జట్టు కూడా ద్వితీయార్థంలో గట్టి పోటీ ఇచ్చింది.


ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 15-6-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# భారత్ ఆవిష్కరణ.. ఫ్రాన్స్ అండగా!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సాంకేతికతే ప్రధాన పోటీ సాధనంగా మారుతున్న ఈ కాలంలో, భారత్--ఫ్రాన్స్ సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయి. ఒకప్పుడు రక్షణ, అణుశక్తి, అంతరిక్ష రంగాలకు మాత్రమే పరిమితమైన ఈ బంధం ఇప్పుడు ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, గ్రీన్ టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల వైపు విస్తరిస్తోంది. "భారత్ ఆవిష్కరిస్తే.. ఫ్రాన్స్ తోడుంటుంది" అనే భావన రెండు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా ఎదుగుతోంది. యువతలో సృజనాత్మకత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు కలిసి కొత్త ఆవిష్కరణలకు దారి తీస్తున్నాయి. మరోవైపు ఫ్రాన్స్‌కు పరిశోధన, ఇంజినీరింగ్, అధునాతన తయారీ, విమానయానం, శక్తి రంగాల్లో విశేష నైపుణ్యం ఉంది. ఈ రెండు దేశాల బలాలు కలిస్తే ప్రపంచ మార్కెట్‌కు పోటీతత్వం కలిగిన సాంకేతిక పరిష్కారాలు అందించే అవకాశం మరింత పెరుగుతుంది. ఇటీవలి కాలంలో ఇరు దేశాలు కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, క్లీన్ ఎనర్జీ, రక్షణ తయారీ, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నాయి. భారతీయ స్టార్టప్‌లకు యూరోపియన్ మార్కెట్లలో అవకాశాలు కల్పించడం, ఫ్రెంచ్ పరిశోధనా సంస్థలతో సంయుక్త ప్రాజెక్టులను ప్రోత్సహించడం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలను బలోపేతం చేయడం వంటి చర్యలు దీర్ఘకాలిక భాగస్వామ్యానికి పునాది వేస్తున్నాయి. ఈ సహకారం కేవలం రెండు దేశాలకే పరిమితం కాదు. ప్రపంచ సరఫరా గొలుసుల్లో వైవిధ్యం తీసుకురావడం, సుస్థిర అభివృద్ధికి తోడ్పడడం, వాతావరణ మార్పుల సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అందించడం వంటి విస్తృత ప్రయోజనాలను కూడా అందించగలదు. ముఖ్యంగా సెమీకండక్టర్లు, పునరుత్పాదక శక్తి, హైడ్రోజన్ ఇంధనం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో ఉమ్మడి పెట్టుబడులు భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే భాగస్వామ్యం విజయవంతం కావాలంటే కేవలం ఒప్పందాలు సరిపోవు. పరిశోధనకు నిధులు, మేధో సంపత్తి పరిరక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ--విద్యాసంస్థల అనుసంధానం, స్టార్టప్‌లకు సులభతర నియంత్రణ వ్యవస్థ వంటి అంశాల్లో నిరంతర కృషి అవసరం. సంయుక్త పరిశోధన ఫలితాలు వాణిజ్యపరంగా విజయవంతమయ్యేలా విధానపరమైన స్థిరత్వం కూడా కీలకం. భారత్ తన జనాభా శక్తిని, డిజిటల్ సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఫ్రాన్స్ తన సాంకేతిక అనుభవం, పరిశోధనా నైపుణ్యాన్ని ఈ ప్రయాణానికి జోడిస్తే ఇరు దేశాలకూ పరస్పర లాభం కలుగుతుంది. పోటీ కంటే సహకారాన్ని, దిగుమతుల కంటే సంయుక్త సృష్టిని, వినియోగం కంటే ఆవిష్కరణను ప్రాధాన్యంగా చూసే ఈ భాగస్వామ్యం 21వ శతాబ్దంలో కొత్త అభివృద్ధి నమూనాకు నాంది పలకగలదు. భారత్-ఫ్రాన్స్ సంబంధాల అసలు బలం కేవలం రక్షణ ఒప్పందాల్లో కాదు; భవిష్యత్తును నిర్మించే సాంకేతిక ఆలోచనల్లో ఉంది. ఆవిష్కరణకు భారత ప్రతిభ, పరిశోధనకు ఫ్రాన్స్ అనుభవం కలిసినప్పుడు, అది రెండు దేశాల విజయమే కాక ప్రపంచానికి కూడా ఒక స్ఫూర్తిదాయక నమూనాగా నిలుస్తుంది.



# దేవ రహస్యం

**దేవతలు ఎవరు? మనల్ని ఈ భూమ్మీద సృష్టించింది వాళ్లేనా? నిజంగా మన సృష్టి కర్తలు దేవతలే అయితే.. వాళ్లు ఎలా ఉంటారు? వాళ్ల ఉనికి ఏమిటి? ఈ ప్రశ్నలన్నీ ఎవరికీ అర్థం కాని.. ఓ పే..ద్ద బ్రహ్మపదార్థం లాంటివి. అన్ని దేశాల్లో అన్ని మతాల్లో రోజూ ఎక్కడో ఓ చోట.. ఏదో రకంగా జరుగుతున్న చర్చ ఇదే.**

మిగతా మతాల మాటెలా ఉన్నా.. మన దేవతల తీరే వేరు.. అనేక రకాల రూపాలు.. అర్థం కాని వాహనాలు.. అసాధారణమైన ఆయుధాలు.. అపూర్వమైన శక్తియుక్తులు.. చిత్రవిచిత్రమైన కథనాలతో కనిపిస్తారు.. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ముక్కోటి మంది దేవతలు ఉన్నారని చెప్తారే.. వీళ్లంతా ఎక్కడ ఉన్నారు? అసలు ఈ మాటల్లో, పురాణాల్లో, కథనాల్లో వాస్తవం ఉందా? ఉంటే అదేమిటి? భూమ్మీద మనిషి జీవితం మొదలైనప్పటి నుంచీ దేవతల గురించిన వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. మనిషికి ఊహ తెలిసినప్పటి నుంచీ చర్చ కొనసాగుతూనే ఉంది. దేవుడున్నాడనే వాళ్లు కొందరు. లేరనే వారు ఇంకొందరు.. వాదాలు.. ఉపవాదాలు. చర్చలు.. ఉప చర్చలు.. ఆధారాలు చూపే ప్రయత్నాలు.. పూజలు.. పునస్కారాలు.. నమ్మకాలు.. మూఢ విశ్వాసాలు.. అన్నీ.. దేవుడి చుట్టూనే తిరుగాడుతూ వస్తున్నాయి. ఇంకా తిరుగుతూనే ఉంటాయి. నిజానికి చాలా యుగాల క్రితమే మన పురాణాల్లో గ్రహాంతరాల్లో వేరే లోకాలు ఉన్నాయని, అందులో జీవులు ఉంటున్నారన్న ప్రస్తావన ఉంది.. వారి గురించి పరిశోధన చేసినట్లూ, వారితో మనుషులు కలిసినట్లూ వుంది... వాళ్లందరూ మనకన్నా చాలా రెట్లు శక్తి మంతులు.. వాళ్ల అనుగ్రహం మనపై ఉంటే మనకు అంతా మంచి జరుగుతుందని భావిస్తూ వస్తున్నాం.... వీళ్లే దేవతలా?

భూమి... లేదా భూగోళం.. ఇంకా చెప్పాలంటే భూలోకం. మనం ఉంటున్న లోకం ఇది.. ఈ లోకానికి కింది భాగాన ఏడు లోకాలు.. పై భాగాన మరో ఆరు లోకాలు వున్నట్లు మన పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి.. భూమికి దిగువన అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలు ఉంటే, ఎగువన భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలు ఉన్నాయని భావిస్తున్నాం.. పై లోకాల్లో యక్ష, రాక్షస, గరుడ, గంధర్వ, కింపురుష, మహర్షులు ఉన్నారని, సత్యలోకంలో బ్రహ్మదేవుడు ఉంటాడని చెప్తారు. బ్రహ్మ దేవుడి పైన క్షీరసాగరం, వైకుంఠం, కైలాసాదులు ఉన్నాయంటారు. భూమ్మీద తపస్సు చేసిన వారికి దేవతలు ఆకాశం నుంచి ప్రత్యక్షమ వుతారు.. కోరిన వరాలిచ్చి ఆదుకుంటారు. గంధర్వులు, దేవ కన్యలు దివి నుంచి భువికి దిగివస్తారు. వీళ్లను మనం పూజిస్తున్నాం.. ఆలయాలను నిర్మించి ఆరాధనలు చేస్తున్నాం.. హోమాలు చేస్తున్నాం.. వీళ్లు మనను అనుగ్రహిస్తున్నారని విశ్వసిస్తున్నాం.. అయితే ఎక్కడి నుంచి మనల్ని చూస్తున్నారు. ఎలా అనుగ్రహిస్తున్నారు? బ్రహ్మదేవుడు సత్యలోకంలో వుంటాడు.. అక్కడి నుంచి ఆయన ఈ భూమ్మీద జీవులను సృష్టిస్తుంటాడు. వాళ్లను పరిపాలించే బాధ్యత.. ఆ బ్రహ్మపైన ఉన్నది విష్ణుమూర్తి. ఆయన వైకుంఠంలో పాల సముద్రంలో లక్ష్మీదేవి చెంతన ఉంటాడు. అందరి జీవితాలు ముగిసిపోయిన తరువాత తనలో లయం చేసుకునే దేవుడు పరమ శివుడు. ఆయన కైలాసంలో ఉంటాడు. అదొక వెండి కొండ.

స్వర్గం, నరకం ఇవన్నీ భూమికి ఎగువన ఉన్నాయంటున్న అనేక లోకాలు ఉన్నమాట వాస్తవమే అయితే.. అక్కడికి వెళ్లటం మనకు ఎందుకు సాధ్యం కావటం లేదు. అసలు ఇలా ఉన్నాయంటున్న లోకాల్లో ఈ దేవీ దేవతల ఆవాసం నిజమేనా? వాళ్లు ఎలా వుంటారు? ఏ రూపంలో ఉంటారు.. ఏం తింటారు? ఎలాంటి బట్టలు కట్టుకుంటారు? ఏ రకమైన వాతావరణంలో ఉంటారు? ఆయా లోకాల నుంచి మనకు తెలియకుండా.. మన ప్రమేయం లేకుండా.. మనల్ని అంటే ఈ భూమిని పరిపాలిస్తున్నారా? అన్నీ అనుమానాలే? అసలు దేవుడు లేనే లేనప్పుడు డిస్కషనే వేస్టంటారు హేతువాదులు. వాస్తవమే.. కళ్లముందు కనిపించని దాని గురించి ఉన్నదని కానీ, లేదని కానీ, ఎలా చెప్పగలం? ఎలా చర్చించగలం? కానీ, మనిషి తనకు ఊహకైనా తెలియకుండా ఒక విషయం గురించి కానీ, ఒక వ్యక్తి గురించి కానీ, ఒక శక్తి గురించి కానీ, భావన చేయటం సాధ్యమేనా? ఏదైనా విషయం గురించి ఆలోచిస్తున్నాడంటే, చర్చిస్తున్నాడంటే.. అందుకు సంబంధించి ఏదో ఒక చిన్న ఘటన కానీ, తనకు అనుభవంలోకి వచ్చి ఉండాలి.. అందుకు సంబంధించిన అనుభూతి కలిగి ఉండాలి. దాన్నుంచే ఆ ఘటన గురించి కానీ, కలిగిన అనుభూతి గురించి కానీ ఆలోచన మొదలవుతుంది. దాని నిజానిజాలు.. వ్యక్తావ్యక్తాల గురించిన భావనకు బీజం పడుతుంది. తన సృష్టికి కారణం ఎవరన్న దానిపై మనిషి తపన మొదలై ఉండాలి. మనిషి మేధస్సును తొలిచి వేస్తున్న దేవతల గురించిన ఆలోచన కూడా ఈ విధంగా వచ్చిందే కావచ్చు. దేవతలకు సంబంధించిన కథలు, బొమ్మలు హిందూ పురాణాల్లో, ఇతిహాసాల్లో, ఆలయాల పైనా చాలానే కనిపిస్తాయి. వేల ఏళ్ల నాటి నిర్మాణాలపైనా చిత్రాల రూపంలో దేవీ దేవతల కథలు ఉంటాయి. రకరకాల రూపాల్లో, రథాలపైనా, గుర్రాల పైనా, యుద్ధం చేసుకుంటున్న బొమ్మలు ఎన్నెన్నో ఉన్నాయి. మన ఇతిహాసాల్లో ఆకాశవాణి పలుకుతుంది.. భవిష్యవాణి చెప్తుంది. దేవుడు ఆగ్రహిస్తే, మబ్బులు ఉరుముతాయి.. మెరుపులు మెరుస్తాయి.. దివి నుంచి గంగ భువికి దిగి వస్తుంది.. భూమి సస్యశ్యామలమవుతుంది.. ఇవన్నీ ఆకాశం నుంచే జరుగుతున్నాయి. అంటే భూమికి ఎగువన ఉన్న లోకాల నుంచి.. ఇలాంటి కథనాలు మన హిందూయిజం లోనే కాదు.. క్రైస్తవ చరిత్రలోనూ ఇది మనకు చాలా క్లియర్గా కనిపిస్తుంది. అతీంద్రియ శక్తులు వున్నట్లు క్రిస్టియానిటీకి చెందిన ప్రాచీన పెయింటింగ్లలో మనకు కనిపిస్తుంది. ఏసుక్రీస్తు బాప్టిజం తీసుకున్న సందర్భంలో ఆకాశం నుంచి దివ్యమైన వెలుగు ఆయనపై ప్రసరించినట్లు కథనం ఉంది. అంతే కాదు క్రీస్తును శిలువ వేస్తున్న సందర్భంలో దేవతలు భూమిపైకి వచ్చి ఆ సన్నివేశానికి సాక్షులుగా నిలిచినట్లూ చెప్తారు.. ఈ కథలు, కథనాలన్నీ కూడా దేవీ దేవతల మూలాలను చెప్తున్నాయి. ఈ కథలన్నింటికీ ఆధారాలు ఏమున్నాయి..? అంటే ఇవాళ ఆధునికంగా సైన్స్ పరిశోధిస్తున్న, ప్రస్తావిస్తున్న ఏలియన్స్ ఈ కథనాలకు మూలమేమో? విశ్వంలో ఎక్కడో ఏదో ఒక చోట ఉన్నారని భావిస్తున్న గ్రహాంతర వాసులనే మన ప్రాచీనులు దేవతలుగా భావించి ఉండవచ్చు. స్టీఫెన్ హాకిన్స్ వంటి శాస్త్రవేత్తలు చెప్తున్నట్లుగా ఏలియన్స్ ఉన్నాయన్న మాటే వాస్తవమైతే వీళ్లను మన పూర్వీకులు చూసి వుంటారా? మనకన్నా శక్తిమంతులైన వాళ్ల నుంచి మేలు పొందారా? అన్నది సందేహం.

గ్రహాంతర వాసులు ఎలా ఉండవచ్చన్నదానికి ఆధారాలు మనకు స్పష్టంగానే లభిస్తున్నాయి. ఏసుక్రీస్తుకు పూర్వం అయిదు వేల ఏళ్ల సంవత్సరాలకు పూర్వమే గ్రహాంతర వాసులను నాటి ప్రజలు గుర్తించారు. వాళ్లరూపు రేఖలను భావితరానికి అందించారు. ఇరాన్లో కొంతకాలం క్రితం తవ్వకాల్లో బయట పడ్డ విగ్రహాలు ఇవే. ఈజిప్ట్ పిరమిడ్లలోనూ ఇలాంటి బొమ్మలు మనకు కనిపిస్తాయి. మన దేశంలోనూ, మొహంజదారో ప్రాంతంలోనూ ఇలాంటి చిత్రవిచిత్రమైన వేషాలు ఉన్న విగ్రహాలు, చిత్రాలు కనిపిస్తాయి. సైంటిస్టుల వాదనలకు మన పురాణాలు, క్రిస్టియానిటీలోని చిత్రాలు ఆధారాలు కాకపోవచ్చు. కానీ, ఎగిరే పళ్లాల రూపంలో చాలా చోట్ల కనిపించిన స్పేస్ షిప్పు ఇందుకు మూలం. ఇలాంటి ఎగిరే పళ్లాలను ప్రపంచంలో చాలా మంది చాలా చోట్ల చూశారు.. రెండు మూడేళ్ల క్రితం ప్రపంచ వ్యాప్తంగా దీనిపై కలకలమే రేగింది.. మన దేశంలోనూ కొన్ని నగరాల్లో ఫ్లైయింగ్ సాసర్లు కనిపించాయి. ఇవి నిజంగా గ్రహాంతరవాసులు వాహనాలేనా అన్నది తేలనైతే తేలలేదు. కానీ, లక్షల కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చి కనురెప్ప పాటులో మాయమైపోయే ఈ వస్తువులకు యుఎఫ్వోలని పేరు పెట్టారు. వీటిపైన తీవ్రస్థాయిలోనే పరిశోధనలు జరుగుతున్నాయి. చివరకు నాసా ప్రయోగించిన చాలా ఉపగ్రహాల చుట్టూ గ్రహాంతర వాసులు తిరుగుతున్నారనే అనుమానాలు పెరుగుతున్నాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు అవే ఉపగ్రహాలు తీసిన వీడియోల్లో కనిపిస్తున్నాయి. వాస్తవానికి 1947 జూలైలో మెక్సికోలో జరిగిన ఓ విచిత్రమైన విమాన ప్రమాదం ఫ్లైయింగ్ సాసర్లపై పరిశోధనలకు నాంది పలికింది. రాస్వెల్క్ సమీపంలో స్పేస్షిప్ కూలిపోవటం, నాలుగు వింతజీవుల మృతదేహాలు అందులో ఉన్నట్లు యుఎఫాలజిస్టుల వాదన. అదే అంతరిక్ష విమానమని, మృతదేహాలు గ్రహాంతర వాసులవనీ వారి వాదన. దీనిపై అమెరికా సర్కారు ఇప్పటికీ పెదవి విప్పలేదు.. రాస్వెల్క్ ఘటనతో ప్రపంచంలో ఎగిరే పళ్లాల గురించిన చర్చ మొదలైంది కానీ, వీటి లింక్ మన పురాణాల్లోనూ కనిపిస్తుంది. విష్ణుమూర్తిని అత్యంత వేగంగా తీసుకుపోగల వాహనం గరుత్మంతుడు.. అలాగే మిగతా దేవతలకూ రకరకాల వాహనాలు ఉన్నాయి. అంతెందుకు ఎంతమంది ఎక్కినా మరొకరికి చోటునిచ్చే పుష్పక విమానమూ దేవతల దగ్గర ఉంది. ఈ వాహనాలను, పుష్పక విమానాన్ని ఎగిరే పళ్లాలు-అదే యుఎఫ్వోలతో పోల్చుకోవచ్చా? కొంచెం స్థిమితంగా ఆలోచిస్తే ఇదీ వాస్తవమే అనిపిస్తుంది. ఎందుకంటే ఇతర గ్రహాలకు చెందిన వాళ్లు మనకంటే చాలా చాలా తెలివైన వాళ్లు, శక్తిమంతులు కదా.. పైలోకాల్లో ఉన్న దేవతలు టెక్నికల్గా మన గ్రహానికి చెందిన వాళ్లు కాదు కాబట్టి వాళ్లు కూడా గ్రహాంతర వాసులే.. అందుకే వాళ్ల వాహనాలు యుఎఫ్ఎలు అయ్యే అవకాశం ఉంది.. బాల యేసుతో మేరీమాత ఉన్నట్లుగా వేసిన చిత్రపటాల్లోనూ ఎగిరే పళ్లాలు కనిపిస్తాయి. ఇంతెందుకు.. ఏసుక్రీస్తుకు సంబంధించిన ప్రతి చితపటంలోనూ గాల్లో తేలే వింత వస్తువులు ఉంటాయి. క్రీస్తును శిలువ వేస్తున్న సందర్భంలో దేవతలు వచ్చింది ఫ్లయింగ్ సాసర్లలోనే అని మనం గమనించవచ్చు. ఇప్పటి పరిశోధనలు గ్రహాంతర వాసుల ఉనికిని స్పష్టం చేస్తున్నాయి.. నాటి చిత్రపటాలు, శిల్పాలు, విగ్రహాలు దేవతల ఉనికిని చాటి చెప్తున్నాయి.

**(..ఇంకా మిగిలే ఉంది. తరువాయి భాగం వచ్చే సోమవారం సంచికలో..)**



కోవెల సంతోష్ కుమార్, రచయిత
ఫోన్ నంబర్: 91 90521 16463

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.